క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ఉదయం నుంచే క్యూ కట్టారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం తదితరులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న కార్తీక్‌రెడ్డి



దర్గాలో కార్తీక్‌రెడ్డి తదితరులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్‌లోని చారిత్రాత్మకమైన బాబా షర్ఫొద్దీన్ దర్గాను బీఆర్‌ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మంగళవారం దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కైసర్ బామ్, సయ్యద్ యూసుఫ్ పటేల్, లక్ష్మీనారాయణ, నిరంజన్, అర్జున్, రాజేష్, అబ్దుల్ రవూఫ్, షాకిర్, శ్రీధర్, మన్నాన్ పాల్గొన్నారు.

వెల్జాల్‌లో వైద్య శిబిరం

382మందికి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీ అంబాజీ, ఉపసర్పంచ్ అజీజ్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కాగా శిబిరంలో 382 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవికుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, రిటైర్డ్ టీచర్ రామచంద్రరావు, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ, నాయకులు.. వెంకట్‌రెడ్డి, అశోక్‌గుప్తా, రాజు, రవీందర్, రాములు, మల్లేశ్, బుచ్చిబాబు, వైద్యులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో ..

ఇబ్రహీంపట్నం: లిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈ వైద్య శిబిరాన్ని సందర్శించి.. బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి లిమ్స్ వైద్య సిబ్బంది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆయన చేత కేక్ కట్ చేయించారు. లిమ్స్ వైద్యులు విశ్వనాథ్, రాంరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు

రాజేంద్రనగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలించడంతో పాటు రాత్రి సమయంలో ఆటో డ్రైవర్లను బెదిరించి నగదు, సెల్‌ఫోన్‌లను దోచుకుంటుంటున్న ముగ్గురు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ముగ్గురిలో ఇద్దరు పాత నేరస్తులు కాగా మరొకరు నిందితుల స్నేహితుడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా తీగలకుంటకు చెందిన జుబేర్‌ఖాన్(22) బేకరీలో పని చేస్తున్నాడు. ఇతడికి సంతోష్‌నగర్‌కు చెందిన సయ్యద్ అర్బాజ్(22) స్నేహితుడు, వీరిపై రాజేంద్రనగర్, సుల్తాన్‌నగర్, ఆసీఫ్‌నగర్‌లలో ఐదు కేసులు నమోదయ్యాయి. గతంలో ఇరువురు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. పహాడీషరీఫ్‌కు చెందిన షేక్ జలీల్(22)తో పరిచయం ఆయ్యారు. ఈనెల మొదటి వారంలో ముగ్గురు కలిసి పీడీపీ చౌరస్తా ప్రాంతంలో అర్ధరాత్రి వేళ ఆటో డ్రైవర్‌ను అడ్డగించి సెల్‌ఫోన్‌తో పాటు 13 వేల నగదును దోచుకెళ్లారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురు నిందితులను పట్టుకొని రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

రాజేంద్రనగర్: అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను నేటి తరానికి వివరించాలని శివరాంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ వెల్లడించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటం చిత్రించే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అంబేడ్కర్ చిత్రాన్ని అందంగా గీశారు. ఉత్తమ చిత్రాలకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా బహుమతులు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూపాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల కుట్రలపై పోరాడిన మహనీయుడు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- ప్రతీ ఒక్కరు పూలే చూపిన మార్గంలో నడవాలి



మీర్‌పేట: పూలే చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, టీకేఆర్

మీర్‌పేట: కులవ్యవస్థ నిర్మూలన, మహిళాభ్యున్నతికి జ్యోతిబాపూలేని కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజలకు సమాన హక్కులను పొందడానికి సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, చల్లా శ్రీనివాస్ రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కూడలిలో..

కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మీర్‌పేట కూడలిలోని జ్యోతిబా పూలే విగ్రహానికి మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, కార్పొరేటర్లు ఎ.భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య, డీఈ గోపీనాథ్, నాయకులు కిషోర్, రాజ్‌కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో..

బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక ఉపాధ్యక్షుడు దాసరి బాబు, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు దాసరి అరవింద్, సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య, నర్సింహ, ప్రభాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల దిక్సూచి: డిప్యూటీ మేయర్ శేఖర్

బడంగ్‌పేట్: బహుజనుల దిక్సూచి జ్యోతిబాపూలే అని భారతదేశంలోని బహుజనులంతా ఆయన చూపిన బాటలో నడవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటి మేయర్ ఇబ్రాం శేఖర్ పిలుపునిచ్చారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు.

జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

హుడాకాంప్లెక్స్: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఆకుల అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సరూర్‌నగర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, నాయకులు లోడి నర్సింహగౌడ్, వెంకట్‌కుమార్, పల్లె వినయ్ కుమార్‌గౌడ్, తాటికొండ రాఘవేంద్ర గుప్తా, జంగారెడ్డి, కాసారపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో

కందుకూరు: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు కొర్వి సురేందర్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బలహీనవర్గాల ఆశా జ్యోతి జ్యోతిరావుపూలే, సావిత్రీభాయిపూలే అని ఈ సందర్భంగా కొనియాడారు. వారి జీవితాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యముదిరాజ్, మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్యముదిరాజ్, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు చెన్నకేశవముదిరాజ్, మన్నే సురేందర్‌ముదిరాజ్, గూడూరు యూత్ అధ్యక్షుడు నాగేష్‌ముదిరాజ్, మదన్మోహన్, చింటూ, ఈశ్వర్, నేదునూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య, బాచుపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కృష్ణ, గులిగి యాదయ్య, నాని తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: పూలే జయంత్యుత్సవాల్లో పాల్గొన్న మేయర్ దుర్గ తదితరులు



కందుకూరు: నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో బుధవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు, నియోజకవర్గ ముఖ్య నేతలు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: తండాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. రావిచేడ్ పంచాయతీ పరిధిలోని మద్దెలకుంట తండాలో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన రూ.6.5లక్షల ప్రొసీడింగ్‌ను మంగళవారం స్థానిక నాయకులకు దశరథ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్.. గ్రామాల అభివృద్ధితో పాటు గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరుచేస్తున్నారన్నారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉప సర్పంచ్ వినోద్, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజు, ఉపేందర్, రమేశ్, సాయికుమార్, శ్రీను, కృష్ణయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు రఘుబాబు గుప్తా



విందుకు హాజరైన ముస్లింలు

కందుకూరు: ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఆర్యవైశ్య సంఘం యూత్ మండల అధ్యక్షుడు రఘుబాబు గుప్తా అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండల కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నవతరం యూత్ అధ్యక్షుడు శివకుమార్, వెంకటేశ్, ఎండీ అజీజ్, అఫ్జల్‌బేగ్, అహ్మద్, సల్మాన్, ముకీమ్‌పాషా, బురాన్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని మసీదులో..

మండల కేంద్రంలోని మసీదులో మంగళవారం సాయంత్రం కొత్తగూడకు చెందిన బొక్క సురేందర్ రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండీ అజీజ్, రఫీక్, పాషా, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని లింకు రోడ్లు



గూడూరు -కందుకూరు మార్గంలో పెరిగిన కంపచెట్లు



గుంతలమయంగా మారిన కందుకూరు-పాత శ్రీశైలం రహదారి

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

కందుకూరు: లింకు రహదారులు అభివృద్ధి నోచుకోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు గుంతలు, కంప చెట్లతో ఉన్న రహదారుల నుంచి రాకపోకలు సాగించడంలో తిప్పలు తప్పడంలేదు. అయినా సంబంధిత అధికార యంత్రాంగం తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తుంది. ఇది కందుకూరు నుంచి గూడూరు, మాలగూడూరు, ఫార్మా రహదారిని కలిపే లింకు రహదారుల దుస్థితి.

గుంతలమయంగా రహదారులు

కందుకూరు మండలం కేంద్రం నుంచి గూడూరు గ్రామం దాని అనుబంధ గ్రామం మాలగూడూరు, మరో గ్రామం కటికపల్లి గ్రామాలకు నేరుగా వెళ్లేలా ఉన్న లింకు రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. గూడూరు, కందుకూరు గ్రామాల మధ్య నుంచి ఫార్మా రహదారి సైతం నిర్మించారు. అక్కడి నుంచి రెండు వైపులా ఉన్న లింకు రహదారులను అభివృద్ధి చేస్తే మండల కేంద్రానికి ఆయా గ్రామాల వైపు నుంచి రాకపోకలు సాగించడానికి వీలవుతుంది. దూరభారం తగ్గుతంది. మరో పక్క నేరుగా ఫార్మాసిటీ రహదారికి చేరుకోవచ్చు. గూడూరు నుంచి కందుకూరు మధ్య ఉన్న లింకు రహదారి దాదాపుగా నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. మాలగూడూరు నుంచి కందుకూరుకు మూడున్నర కిలోమీటర్ల మేర ఉంటుంది. ఆ రహదారులతో పాటు పాత శ్రీశైలం రహదారి ప్రస్తుతం ఫార్మా రహదారి నుంచి కందుకూరుకు మరో రెండు కిలోమీటర్ల మేర దూరం ఉంటుంది. ప్రస్తుతం ఆ రహదారులు గుంతలమయంగా మారాయి. ఇరువైపులా కంప చెట్లతో నిండిపోయి ఇబ్బందికరంగా ఉన్నాయి. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలు సాగించలేం. ఆ లింకు రహదారులను అభివృద్ధిచేస్తే గూడూరు, కటికపల్లి గ్రామాలతో పాటు ఆ పైనున్న రాచులూరు, లేమూరు, తిమ్మాపూర్, బేగంపేట, అగర్‌మియాగూడ, సరస్వతిగూడ, గుమ్మడవెల్లి తదితర గ్రామాల వైపు నుంచి వచ్చే వారికి దూరభారం తగ్గుతుంది. మరోవక్క ఆ రహదారులను అభివృద్ధి చేస్తే రైతులకు సులభంగా తమ వ్యవసాయ క్షేత్రాలకు చేరుకునే వీలుంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లింకు రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

కందుకూరు నుంచి గూడూరు, మాలగూడూరుతో పాటు పాత శ్రీశైలం రహదారి మార్గంలో ఫార్మా రహదారి వరకు లింకు రహదారుల అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు ఇంకా మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే సమస్య పరిష్కారం అవుతుంది.

– సతీశ్ రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం



నాగారంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రఘుమారెడ్డి తదితరులు

- ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: అంధత్వ నివారణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం, పెండ్యాల గ్రామాల్లో నేత్ర శిబిరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులతో కలిసి ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ×కంటివెలుగు×ను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. చూపు సమస్యలతో బాధపడేవారు కంటి పరీక్ష చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు కళ్లద్దాలు పెట్టుకోవాలని, మందులు వాడి కంటి పాపను కాపాడుకోవాలని చెప్పారు. ఈ రెండు వైద్య శిబిరాలలో 257 మందికి వైద్యులు పరీక్ష చేశారు. దగ్గర చూపు సమస్య ఉన్న 46 మందికి కళ్లద్దాలు పంపిణీ చేయగా.. మరో 65 మందికి ఆర్డర్ ఇచ్చారు. 12 మందిని శస్త్ర చికిత్స కోసం సరోజినిదేవి కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునిత, ఎంపీడీఓ నర్సింహ, నాగారం సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ ఎండీ లతిఫ్‌ఖాన్, ఎంపీటీసీ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, క్యాంప్ మెడికల్ అధికారిణి డా. సౌమ్య, వైద్య సిబ్బంది 108 శ్రీనివాస్, నర్సింహ స్వామి, సువర్ణ, ఏఎన్‌ఎం సువర్ణ, సుగుణవతి, మంగ పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వడగళ్ల బాధితులకు పరిహారం ఇవ్వండి

ఎంపీపీ సుకన్య

యాచారం: మంతన్‌గౌరెల్లి గ్రామంలో వడగళ్ల వర్షానికి నష్టపోయిన ప్రజలకు, రైతాంగానికి పరిహారం ఎప్పుడు అందజేస్తారని ఎంపీపీ కొప్పు సుకన్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ... 15 రోజుల కింద వడగళ్లు కురిసి గ్రామంలో 500కు పైగా రేకుల ఇళ్లకు రంధ్రాలు పడి దెబ్బతింటే.. రెండు, మూడు రోజుల్లో పరిహారం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పరిహారం అందే లా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

రాజేంద్రనగర్: వేగంగా దూసుకువచ్చిన భారీ టిప్పర్ వాహనం అదుపుతప్పి ఓఆర్‌ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డుపై పడింది. ఈ ఘటనలో స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. రాజేంద్రనగర్ పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం రామోజీఫిల్మిసిటీ ప్రాంతం నుంచి 34 టన్నుల డస్టును తీసుకొని డ్రైవర్ లక్ష్మణ్ గచ్చిబౌలి వైపు వెళ్తున్నాడు. హిమాయత్‌సాగర్ ప్రాంతం వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి ఓఆర్‌ఆర్ ప్రహరీని ఢీకొట్టింది. భారీ లోడ్‌తో ఉన్న వాహనం కావడంతో ప్రహరీని దాటి సర్వీస్ రోడ్డుపై పడింది. ఈ సమయంలో అటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైరాగిగూడ ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం



ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు నోటీసు అందజేస్తున్న వార్డు సభ్యులు

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడ ఉప సర్పంచ్ పి.వెంకటేశ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరుతూ వార్డు సభ్యులు మంగళవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు నోటీసు అందించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు అందుగుల నరేందర్, గుల్వి పరమేశ్వరి, పల్స అనిత, పండాల మౌనిక, యాచారం మైసయ్య మాట్లాడుతూ...ఉప సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు, భూకబ్జాలు, ఒంటెద్దు పోకడలతో విసిగిపోయి అవిశ్వాస తీర్మానానికి నోటీసులు అందించామన్నారు.

నిధులు లేకుండా 'పట్టణ ప్రగతా?'

- అధికారులను ప్రశ్నించిన కార్పొరేటర్



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: నిధులు లేకుండా కాలనీల్లో పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించడం ఎందుకని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమం మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో సమస్యల పరిష్కరం కోసం నిధులు కేటాయించి పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించకుండా తూతూ మంత్రంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. డివిజన్‌లోని చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీ మారుతిదివాకర్ మాట్లాడుతూ, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీల్లో వంద రోజుల పాటు సమావేశాలు నిర్వహించి కాలనీవాసుల నుంచి సమస్యలు తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ పోచమ్మ ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా అలకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చనలు, హోమం ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. ఈ పూజల్లో తిరునగర్ గోపాల్, వర్కాల చందు, తిరందాస్ నరేందర్, కోటా శ్యామ్, కైరంకొండ శంకర్, కాల రాజు, ఇందిరా, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్పంచ్ క్షమాపణ చెప్పాల్సిందే

- ఎంపీపీ కార్యాలయం ఎదుట ఎఫ్‌ఏల నిరసన



ఎంపీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎఫ్‌ఏలు

తలకొండపల్లి: పడకల్ సంర్పంచ్.. ఓ మహిళను అసభ్య పదజాలంతో దూషించారని.. పద్ధతి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఫీల్డ్ అసిస్టెంట్‌లు హెచ్చరించారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య భార్య పద్మమ్మను ఇటీవల అకారణంగా అదే గ్రామానికి చెందిన సర్పంచ్ రమేష్ అసభ్య పదజాలంతో దూషించారు. తీవ్ర మనస్థాపానికి గురైన పద్మమ్మ పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ వెంటనే క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షురాలు మంగమ్మ, కోశాధికారి రాములు, వెంకటేశ్, సాల్వయ్య, రామచంద్రయ్య, లక్ష్మీదేవి, నర్సింహ, సత్యనారాయణ, చిన్నారెడ్డి, చంద్రయ్య, బాల్‌చెన్నయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.